సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 19 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.30 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.2,500 ప్రకారం ధర పలికాయి.



వందనం ఇష్టానుసారం
తప్పుల తడకగా ఉన్న తల్లికి వందనం అర్హుల జాబితాపై 'సాక్షి' వరుస కథనాల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

10లో



జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అల్పాహారం.. నిత్యన్నదానం
- ఖాద్రీశుని ఆలయంలో భక్తులకు సౌకర్యాలు



ఆలయ కార్యాలయం వద్ద వీల్ చైర్ సౌకర్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా రోజూ అల్పాహారం, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అల్పాహారంలో భాగంగా సోమవారం వెజిటబుల్ ఉప్మా, పల్లీల చట్నీ, మంగళవారం ఉగ్గాని, పల్లీల చట్నీ, బుధ, శుక్రవారాల్లో బిస్మిల్లా బాత్, గురువారం వెజిటబుల్ ఉప్మా, పల్లీల చట్నీ, శని, ఆదివారాలు పెసర పప్పు పొంగలి, సాంబర్ అందిస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం కూడా రుచికరమైన పదార్థాలతో వడ్డించనున్నట్లు ఈఓ వెల్లడించారు. అంతేకాకుండా స్వామి దర్శనం కోసం వచ్చే బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్ సౌకర్యం కల్పించామన్నారు. ఇక వయోవృద్ధులు, చిన్న పిల్లలున్న తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటుకు గ్రీన్‌సిగ్నల్
అనంతపురం ఎడ్యుకేషన్: అవసరమైన పాఠశాలలకు 1998, 2008 ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రక్రియ ఈనెల 20లోగా పూర్తి చేయాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ముందుగా సీనియార్టీ జాబితాను తయారు చేయనున్నారు. సీనియార్టీని అనుసరించి అవసరమైన స్కూళ్లకు సర్దుబాటు చేస్తామని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించడం తప్పా?
- పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం
- మండిపడిన బీఎస్పీ నాయకులు



సీకేపల్లి స్టేషన్ వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ నేతలు

రామగిరి: తీవ్ర అన్యాయానికి గురైన దళిత మైనర్ బాలిక కుటుంబం కనీసం పరామర్శకు కూడా నోచుకోకుండా కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని, ఈ పరిస్థితి చూస్తుంటే రాష్ట్రంలో నిజంగానే రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్నట్లు తెలుస్తోందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు సిందనూరు నాగరాజు, గద్దల నాగభూషణం అన్నారు. రామగిరి మండలంలోని ఏడుగుర్రాల పల్లిలోని ఓ దళిత బాలికపై 14 మంది కీచకులు నెలలపాటు దాష్టీకానికి పాల్పడగా ఆ చిన్నారి గర్భం దాల్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బాలిక అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం బీఎస్పీ నేతల బృందం ఏడుగుర్రాలపల్లికి బయలుదేరింది. అయితే పోలీసులు బీఎస్పీ నేతల బృందాన్ని ఎస్‌ఎస్ గేట్‌లో అడ్డుకుని చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందస్తు అనుమతి లేనిదే ఏడుగుర్రాలపల్లికి అనుమతించబోమన్నారు. దీనిపై బీఎస్పీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే హక్కు రాజ్యాంగం ప్రతి పౌరునికీ కల్పించిందన్నారు. పోలీసులు పాలకులకు వంత పాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. దళిత బాలికపై దాష్టీకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోని ప్రభుత్వం... ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా, సామాజికంగా న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగరాజు, బైనేని శ్రీనివాసరాజు, అంకె కుళ్లయప్ప, హరిప్రసాద్, నాగసుబ్బరాయుడు, శీన, కుంచె గోపాల్, నాగమ్మ, జయచంద్ర, కృష్ణ, రాజు, గంగాధర్, లింగరాజు, హనుమంతప్ప, నాగరత్నమ్మ, శశికళ, నాగవేణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బతుకులు అవుట్!

- ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా ప్లంబింగ్ పని చేసేవాడు. ఐపీఎల్ బెట్టింగ్‌లో రూ.3 లక్షల వరకూ పోగొట్టుకున్నాడు. దీంతో అప్పులిచ్చిన వారు వెంటపడటంతో ఇటీవల బెంగుళూరులో ఉరివేసుకుని చనిపోయాడు.
- కదిరికి చెందిన సోమసుందర్ రాజు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇటీవల ఐపీఎల్ సమయంలో బెట్టింగ్ ఆడి రూ.30 లక్షలు పోగొట్టుకున్నాడు. భార్య నగలన్నీ అమ్మేశాడు. ఇప్పుడతను ఊరు వదిలి బెంగుళూరు పరారయ్యాడు. అప్పు ఇచ్చిన వాళ్లు లబోదిబోమంటున్నారు.

ఐపీఎల్ ముగిసి.. కష్టాలు మిగిలి
- బెట్టింగ్‌లతో అప్పుల పాలైన వేలాదిమంది యువకులు
- నెలలోనే ఉమ్మడి జిల్లాలో 13 మంది ఆత్మహత్య
- అప్పులోళ్ల బాధ తట్టుకోలేక పలువురు ఊళ్లు వదిలిన వైనం
- బెట్టింగ్ ఉచ్చులో పలువురు ప్రభుత్వ ఉద్యోగులూ ..





సాక్షి ప్రతినిధి, అనంతపురం: దురాశ దుఃఖానికి చేటు అని ఊరికే అనలేదేమో! రాత్రికి రాత్రే కోటీశ్వరులవుదామన్న ఆలోచన వేల కుటుంబాలను నిలువునా ముంచేసింది. చదువుకుని.. ఆలోచించే సామర్థ్యముండీ.. కష్టపడే స్వభావం ఉన్న యువకులనూ దురాలోచన ముంచేసింది. బెట్టింగ్ బెట్టింగ్ బెట్టింగ్... అంటూ దాని వెంటపడి చివరకు ప్రాణాలే ఫణంగా పెట్టారు. సుమారు 45 రోజుల పాటు సాగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ మ్యాచ్‌లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేల కుటుంబాలను నిలువ నీడ లేకుండా చేశాయి.

13 మంది ఆత్మహత్య

క్రికెట్ బెట్టింగ్ భూతం చాలా కుటుంబాలను కల్లోలంలోకి నెట్టింది. ఉమ్మడి జిల్లాలో ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ ఆడి సర్వస్వం పోగొట్టుకున్న 13 మంది ఆత్మహత్య చేసుకున్నారు. కొంతమంది ఊళ్లు వదిలి వెళ్లారు. ఇంకొందరు ఆస్తులు తాకట్టు పెట్టారు. మరికొందరు తమకున్న కొద్దిపాటి భూములను కూడా అమ్మేసి అప్పు కట్టిన పరిస్థితి. చాలామంది తమ భార్యల బంగారు నగలను తాకట్టు పెట్టి బెట్టింగ్ ఆడి సర్వస్వం కోల్పోయారు. ఇప్పుడు బోరున విలపిస్తున్నారు.

కదిరి, తాడిపత్రిలలో అత్యధికంగా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి, కదిరి ప్రాంతాల్లో చాలా మంది ఐపీఎల్ బెట్టింగ్ భూతానికి చిక్కి నష్టపోయినట్టు వెల్లడైంది. ఎక్కువ పోలీసు కేసులు కూడా ఈ ప్రాంతాల్లోనే నమోదు కావడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లోనే బుకీలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఉమ్మడి జిల్లాలో మిగతా ప్రాంతాల్లోనూ బాగానే బెట్టింగ్ జరిగింది. మ్యాచ్ మ్యాచ్‌కు కాకుండా ఓవర్ టు ఓవర్‌కు కూడా పందెం కాశారు. ఈ క్రమంలో డబ్బు పోగొట్టుకున్న వారు ఊరు వదిలి వెళ్లిపోవడంతో అప్పులిచ్చిన కుటుంబాలు వీధిన పడ్డాయి.కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం బెట్టింగ్‌లో మునిగి కుటుంబాలను బజారున పడేశారు. ఐటీ ఉద్యోగులు కూడా ఎక్కువమంది నష్టపోయారు.

ఐపీఎల్ జరిగిన రోజులు	45
మొత్తం మ్యాచ్‌లు	74
ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ వ్యయం	రూ.1,000 కోట్లు పైనే
బెట్టింగ్‌లో నష్టపోయిన వారు	3,000 మంది పైనే
బెట్టింగ్ కారణంగా ఆత్మహత్యలు	13

స్వీయనియంత్రణ పాటించాలి



బెట్టింగ్‌లో సర్వస్వం కోల్పోయి నా దగ్గరకు వచ్చిన వాళ్లలో ఐటీ ఉద్యోగులే ఎక్కువ. డ్రగ్స్ కంటే ప్రమాదకరంగా మారింది. దీన్ని అడిక్షన్ డిజార్డర్‌గా చెప్పుకోవచ్చు. ముందు అలవాటవుతుంది.. తర్వాత వ్యసనమై చివరకు జబ్బుగా మారుతుంది. ఆన్‌లైన్ యాప్‌ల జోలికి వెళ్లకుండా స్వీయ నియంత్రణ పాటించడం తప్ప చేయగలిగిందేమీ లేదు.

–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు, అనంతపురం

'యోగాంధ్ర'ను విజయవంతం చేయండి



యోగాంధ్ర నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ నిర్వహించే 'యోగాంధ్ర' కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి అంతర్జాతీయ యోగా కార్యక్రమం నిర్వహణ, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, తల్లికి వందనం తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 21న జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ మూడో శనివారం యోగా థీమ్‌తో నిర్వహించాలన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి వీలైనంత త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్ మళ్లీ విధుల్లోకి!
- 12న బుక్కపట్నం తహసీల్దార్ షాబుద్దీన్ బదిలీ
- బుధవారం మళ్లీ బుక్కపట్నంలోనే విధులు

పుట్టపర్తి: సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 12న తనకల్లు మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ షాబుద్దీన్ కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే మళ్లీ బుక్కపట్నంలో ప్రత్యక్షమయ్యారు. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడకుండానే బుధవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ నుంచి బాధ్యతలు తీసుకుని విధులు నిర్వర్తించడం చర్చనీయాంశమైంది.

అక్కడ వద్దన్నారనీ...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఉద్యోగుల బదిలీలు జరిగాయి, ఈక్రమంలోనే ఏడాది క్రితం బుక్కపట్నం తహసీల్దార్‌గా షాబుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన కలెక్టర్ టీఎస్ చేతన్ ఆయన్ను తనకల్లు మండలానికి బదిలీ చేశారు. అతని స్థానంలో ఇక్కడే విధులు నిర్వహిస్తున్న డీటీ నరసింహులుకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో షాబుద్దీన్.. డీటీ నరసింహులుకు చార్జ్ ఇచ్చారు. అయితే షాబుద్దీన్ విధుల్లో చేరకుండా అక్కడి ముఖ్య నాయకుడు అడ్డుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో షాబుద్దీన్ బుధవారం బుక్కపట్నం కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. తహసీల్దార్ సీట్లో కూర్చుని విధులు నిర్వర్తించారు. డిజిటల్ కీ ద్వారా ఎడాపెడా సంతకాలు చేసేశారు. ఇంతకీ షాబుద్దీన్‌ను తిరిగి బుక్కపట్నం తహసీల్దార్‌గా బదిలీ చేశారా...లేక రాజకీయ నేతల అండతో అతను దర్జాగా విధులు నిర్వర్తిస్తున్నారా అన్నది కార్యాలయ అధికారులకే అంతుబట్టడం లేదు. దీనిపై వివరణ కోరేందుకు రెవెన్యూ ఉన్నతాధికారులను ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు.

సత్యసాయి కీర్తి ఎల్లలు దాటాలి
- శతజయంతి వేడుకలు మరో వందేళ్లు గుర్తుండాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష



సత్యసాయి శతజయంతి వేడుకల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'సత్యసాయి కీర్తి ఎల్లలు దాటేలా శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలి.. అందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలి. నవంబర్ 23న శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలి. జిల్లా యంత్రాంగం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు అందరూ సమష్టిగా పనిచేసి శతజయంతి ఉత్సవాలు మరో వందేళ్లు గుర్తుండేలా వైభవంగా చేద్దాం' అంటూ కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సత్యసాయి శతజయంతి వేడుకల నేపథ్యంలో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై బుధవారం కలెక్టర్ చేతన్ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో కలిసి సమీక్షించారు. ముందుగా ఇప్పటికే కేటాయించిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులకు కేటాయించిన పనులను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున... ఆరు హెలీప్యాడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ తదితర పనులను ఇప్పటికే అధికారులకు అప్పగించామని, వారంతా పకడ్బందీగా పనులు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో కూడా తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పట్టణ సుందరీకరణతోపాటు చిత్రావతి నది సుందరీకరణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చిత్రావతి హారతి ఘాట్, కమ్మవారిపల్లి, కప్పలబండ, ఎంఎస్ఎంఈ పార్క్ పాయింట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు. అలాగే వివిధ మార్గాల గురించి భక్తులకు తెలిసే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పాయింట్ల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మందులను సిద్ధంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన పనులను చిత్తశుద్ధిలో పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి నేతల బాహాబాహీ
- సీకేపల్లి ధాబాలో ఇరు వర్గాల ఘర్షణ
- 'పరిటాల' అనుచరులపై కత్తితో దాడి చేసిన సూరి అనుచరుడు
- ప్రతిదాడిగా రాళ్లతో రణరంగం సృష్టించిన పరిటాల వర్గం



సాక్షి టాస్క్‌ఫోర్స్: చెన్నేకొత్తపల్లిలోని ఓ ధాబాలో కూటమి నేతలు బాహాబాహీకి దిగారు. ఓ వర్గం నాయకుడు కత్తితో దాడి చేయగా...మరోవర్గం వారు రాళ్లదాడితో రణరంగం సృష్టించారు. ఈ ఘటన బుధవారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఎస్‌ఎస్ గేట్‌కు చెందిన ఖాసీంవలి, నాగరాజు పరిటాల శ్రీరామ్ అనుచరులు. వీరిద్దరూ బుధవారం సీకేపల్లిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ధాబాలో కూర్చుని ఉన్నారు. అదే సమయంలో ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన అరవింద్ రెడ్డితో పాటు మరికొందరు టీ తాగేందుకు అదే డాబాకు వచ్చారు. అరవింద్‌రెడ్డి గతంలో వరదాపురం సూరి ప్రధాన అనుచరుడుగా ఉన్నాడు. ఈ క్రమంలో పరిటాల శ్రీరామ్ అనుచరులు ఖాసీంవలి, నాగరాజు ధర్మవరం రాజకీయాల గురించి మాట్లాడుకుంటుండగా... అరవింద్‌రెడ్డి కలుగజేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి... ఒకరిపై మరొకరు దాడికి దిగారు. దీంతో అరవింద్‌రెడ్డి ధాబాలోని వంటగదిలోకి వెళ్లి కత్తి తీసుకుని వచ్చి ఖాసీంవలి, నాగరాజుపై దాడి చేశాడు. వారిద్దరూ రాళ్లతో అరవిందరెడ్డిపై ప్రతిదాడి చేశారు. ఈ ఘటనలో ఇరువర్గాల వారు గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ప్రస్తుతం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అరవింద్‌రెడ్డి ఫిర్యాదు అందిన వెంటనే ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేస్తామని చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.



దాడిలో గాయపడిన అరవింద్‌రెడ్డి

సాగుభారం
- పెరిగిన పెట్టుబడులు..దక్కని 'మద్దతు'
- నేటికీ అందని 'అన్నదాత సుఖీభవ'
- అందినకాడికి అప్పులు చేస్తున్న అన్నదాత
- బ్యాంకుల్లోనూ బంగారం తాకట్టు పెడుతున్న వైనం



విత్తనం వేస్తున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: భూమితల్లినే నమ్ముకున్న రైతన్నకు వ్యవసాయం భారంగా మారింది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ నాటికి ఇటు పంట పెట్టుబడులు, అటు పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులు కలిపి తడిసిమోపెడవుతున్నాయి. ఆర్థికంగా అండగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండగా.. చాలా మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. అప్పటికీ అవసరాలు తీరని వారు బంగారాన్ని బ్యాంకుల్లో, ప్రైవేటు ఫైనాన్సుల్లో తాకట్టు పెడుతున్నారు. ఇవన్నీ ఎందుకు అనుకున్న వారు కాడి కింద పడేసి బతుకుదెరువు కోసం వలస పోతున్నారు.

ఎరువులు, విత్తనాల ధరలకు రెక్కలు

ఎరువులు, విత్తనాల ధరలు ఏటికేడు పెరిగిపోతున్నాయి. కనీసం రాయితీపై ఇచ్చే విత్తనమైనా వేద్దామంటే నాసిరకంగా ఉంటోంది. పైగా ఎంత భూమి ఉన్నా మూడు బస్తాల వేరుశనగతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు మార్కెట్‌లో కిలో వేరుశనగ విత్తనం రూ.130 వెచ్చించి కొనాల్సి వస్తోంది. ఇక ఎరువుల ధరలూ అమాంతం పెరిగిపోవడంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.

కాడెద్దులూ బరువై

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల వద్ద ఉన్న కాడెద్దులూ భారంగా మారాయి. దీంతో వాటిని మార్కెట్‌కు తరలించి అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లూ చాలా మంది రైతులు కాడెద్దుల బండితో ఇసుక తోలుకుంటూ కుటుంబాలను పోషించుకున్నారు. కూటమి ప్రభుత్వం ట్రాక్టర్లను మాత్రమే అనుమతించడంతో ఎద్దులు భారంగా మారాయి.

పెరిగిన సాగు ఖర్చులు

పొలం దున్నేందుకు గతంలో ట్రాక్టర్‌కు ఒక గంటకు రూ.800 తీసుకునేవారు. ప్రస్తుతం రూ.1,000 వరకూ వసూలు చేస్తున్నారు. గతంలో రోజుకూలి రూ.250 ఉండగా.. ఇపుడు రూ.400 వరకూ తీసుకుంటున్నారు. విత్తనం వేసేందుకు, కలుపు మందులు, పురుగు మందులు..ఇలా అన్ని ఖర్చులూ పెరిగాయి. దీంతో ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ సాగుకు చేయాలంటే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు అవుతోంది. గతంలో మొక్క జొన్న పంట సాగుకు ఎకరాకు రూ.15 వేలు మాత్రమే ఖర్చయ్యేది. ప్రస్తుతం రూ.25 వేలకు పెరిగింది. కంది సాగు సైతం ప్రస్తుతం భారమైంది. డబ్బుకు వెనకాడకుండా ఖర్చు చేసి పంటలు సాగుచేసినా చివర్లో 'మద్దతు' దక్కక పంటను మూడు దుడ్లకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఆదుకోని కూటమి సర్కార్

పంటల సాగుకు రైతులు నానా కష్టాలు పడుతున్నా...కూటమి సర్కారు ఈ ఏడాది కాలంలో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. రైతు భరోసా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, డ్వాక్రా రుణాలు మాఫీ, చేదోడు తదితర పథకాలతో ప్రతి నెలా.. ప్రతి ఇంటికీ డబ్బు జమ చేస్తూ వచ్చారు. రైతులకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేసి ఆదుకున్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీసం పంటల బీమా కూడా ఉచితంగా చేయడం లేదు. వేరుశనగకు ఎకరాకు రూ.640, మొక్కజొన్న రూ.660, కందికి రూ.400 చొప్పున కట్టించుకుని పంటల బీమా చేయిస్తోంది. దీంతో బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలకు పంటల బీమా తోడైంది. ఇక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' నిధులూ ఇప్పటి వరకూ అందించలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతును నిలువుదోపిడి చేస్తోంది తప్ప... ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యంత్రాలతో విత్తనం వేస్తున్న దృశ్యం



రైతులతో కిటకిటలాడుతున్న బ్యాంకు

వాతావరణం అనుకూలిస్తేనే..



ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసినా... వాతావరణం అనుకూలిస్తే పంట చేతికొస్తుంది. లేదంటే రైతుకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఒక వేళ అదృష్టం బాగుండి పంట చేతికి అందినా..గిట్టుబాటు ధర లభించక నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతు వేసే ప్రతి అడుగులోనూ ప్రభుత్వం సాయంగా నిలవాలి. మార్కెట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి. లేకపోతే రైతు బతుకు దుర్భరమవుతుంది.

– లక్ష్మీనారాయణరెడ్డి, జగరాజుపల్లి

సాగు ఖర్చులు పెరిగాయి



ఏటా పంటల సాగుకయ్యే ఖర్చులు పెరుగుతున్నా... గిట్టుబాటు ధరలు లేక నష్టాలు వస్తున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతు బతుకుతాడు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి. పంటల కోత సమయానికంటే ముందే గిట్టుబాటు ధరలు కల్పించి ప్రతి పంటనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. గతంలో ఎకరా వేరుశనగ సాగుకు రూ.20 వేలు ఖర్చయ్యేది. ఇప్పుడది రూ.50 వేలకు చేరింది.

– నాగభూషణ, రైతు, పెదపల్లి

క్లుప్తంగా

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ



రాయితీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో 2024–25 సంవత్సరానికి గాను వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీకి సంబంధించి రూ.1.72 కోట్ల రాయితీ చెక్కును అర్హులైన 1,021 మంది రైతులకు కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం అందజేశారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రోటవేటర్లు, బ్రష్‌కట్టర్లు, స్ప్రేయర్లు, మతుకలు, నూర్పిడి యంత్రాలు వంటివి రైతులకు ఆర్ఎస్‌కేల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎఫ్‌పీఓ ప్రతినిధులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి ఎఫ్‌పీఓలు చేపడుతున్న రైతు సంబంధిత కార్యక్రమాలు, సమస్యలపై ఆరా తీశారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై ఎఫ్‌పీఓలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ సుబ్బారావు, జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న అతివేగం

తనకల్లు: అతి వేగం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. తనకల్లు మండలం ముత్యాలవాండ్లపల్లికి చెందిన పుప్పాల కిరణ్‌కుమార్ (23) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. వ్యక్తిగత పనిపై బుధవారం కొక్కంటిక్రాస్‌కు వచ్చాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. నల్లగుట్లపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారిపై అతివేగంగా వెళుతూ నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో కిందపడిన కిరణ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో కిరణ్‌కుమార్‌ను తనకల్లులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక సాకు.. తిరకాసు

అనంతపురంలోని తపోవనంలో నివాసముంటున్న దామోదరరెడ్డి ఇటీవల 4 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామ్‌నగర్‌లోని ఓ డాక్యుమెంట్ రైటర్‌ని కలిశాడు. అతను స్టాంప్ వెండర్ దగ్గరకు పిలుచుకెళ్లి స్టాంపులు కావాలని అడిగితే స్థలం విలువలో 6.5శాతం స్టాంప్ డ్యూటీని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ పేరిట చలానా తీస్తే ఈ–స్టాంపు ఇస్తామన్నాడు. దీంతో ఏజెన్సీ పేరిట చలానా తీసే సమయంలో ఖాతాలో నగదు కట్ అయింది కానీ, చలానా రాకుండా హోల్డ్‌లోకి వెళ్లింది. దీంతో దాదాపు రూ.40వేలకు పైగా నగదు అలాగే నిలిచిపోయింది.

- స్టాంప్ వెండర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న స్టాక్ హోల్డ్ ఏజెన్సీ
- ఏజెన్సీ పేరిట చలానా తీస్తేనే ఈ–స్టాంపులంటూ మెలిక
- చలానా తీసే సమయంలో నగదు హోల్డ్‌లో పడి నష్టపోతున్న వినియోగదారులు
- నగరంలో కేవలం ఒకరికే స్టాంపుల సరఫరా
- దందాకు తెరలేపిన సదరు స్టాంప్ వెండర్
- పట్టించుకోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

అనంతపురం టౌన్: భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో స్థలం విలువలో స్టాంప్ డ్యూటీ కింద 6.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1 శాతం, యూజర్ ఛార్జీల కింద రూ.550 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాలన్నింటినీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చలానా రూపంలో వినియోగదారులు చెల్లించాలి. అయితే ప్రస్తుతం నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించిన ఈ–స్టాంపుల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ సాంకేతిక సాకును తమకు అనుకూలంగా మార్చుకున్న ఏజెన్సీ నిర్వాహకులు తిరకాసులు పెడుతూ స్టాంపు వెండర్లకు ఈ–స్టాంపుల స్టాక్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ, భూపాళం కాంప్లెక్స్, కర్నూలు పేరిట చలానా తీస్తేనే ఈ–స్టాంపులు ఇస్తామని వెండర్లకు మెలిక పెడుతున్నారు. ఏజెన్సీ పేరుతో చలానా తీసే సమయంలో ఖాతాలోని నగదు హోల్డ్ పడితే ఎవ్వరిని అడగాలి? ఖాతా నుంచి కట్ అయిన నగదు తిరిగి ఖాతాలో జమ అవుతుందా? వీటికి స్టాక్ హోల్డ్ ఏజెన్సీ నుంచి ఎలాంటి స్పష్టత లేదు.

ఒక్కరికే ఈ–స్టాంపులు

రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలోని ఓ కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడికి మాత్రమే అధీకృత ఈ–స్టాంప్‌లను కర్నూలులోని స్టాక్ హోల్డ్ ఏజెన్సీ నిర్వాహకులు అందిస్తున్నారు. దీంతో ఈ–స్టాంపుల కోసం సీఎస్‌సీ కేంద్రం వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని సదరు కేంద్రం నిర్వాహకుడు అధిక ధరకు ఈ–స్టాంప్‌లు విక్రయిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. రూ.100 విలువ చేసే స్టాంపును రూ.150 నుంచి రూ.180 వరకు అవసరాన్ని బట్టి నగదు చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రూ.50 విలువ చేసే ఈ–స్టాంప్‌ను రాప్తాడుకు చెందిన ఓ వ్యక్తి రెట్టింపు ధరతో కొనుగోలు చేశాడంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



స్టాంపుల కోసం వేచి ఉన్న వినియోగదారులు

పట్టించుకోని అధికారులు:

ఈ–స్టాంపుల అధిక ధర విక్రయాలను అడ్డుకోవాల్సిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో స్టాంప్‌ల విక్రయదారులు ఆడిందే ఆట... పాడింది పాటగా వ్యవహరిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. నగరంలో ఒక్కరికే ఈ–స్టాంప్‌ల విక్రయానికి అనుమతులు ఇవ్వడంతో ఆయన చెప్పిందే ధరగా మారింది. లేదంటే స్టాంపులు లేవంటూ నిర్లక్ష్యంగా వెనక్కు పంపించేస్తాడు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని స్టాంపుల విక్రయ కేంద్రాన్ని మూసి ఇప్పటికే ఏడాది కావస్తోంది. దీంతో స్టాంపుల కోసం అధిక మొత్తంలో చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం



స్టాక్ హోల్డ్ కార్పొరేషన్ ఏజెన్సీ నుంచి జిల్లాలోని స్టాంప్ వెండర్లందరికీ స్టాంపులు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లాలో నెలకొన్న స్టాంపుల కొరత సమస్యపై ఉన్నతాధికారులతో చర్చించాం. అన్ని రకాల స్టాంపులను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అందుబాటులోకి తీసుకువస్తాం. – భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

‘వందనం’..ఇష్టానుసారం

- గ్రామంలో లేనివారి పేర్లతో జాబితా
- 39 మంది విద్యార్థులకు అన్యాయం
- ఎంఈఓ విచారణలో తప్పులు తేటతెల్లం

పుట్టపర్తి అర్బన్: ‘తల్లికి వందనం’ అర్హుల జాబితాలో అధికారులు ఇష్టానుసారం వ్యవహరించారు. గ్రామంలోనే లేనివారి పేర్లతో జాబితా రూపొందించి 39 మంది విద్యార్థులకు అన్యాయం చేశారు. ఈక్రమంలో ‘తల్లికి వందనం’ పథకం అర్హుల జాబితాలో జరిగిన తప్పులను ఎత్తి చూపుతూ ఈనెల 16, 18 తేదీల్లో ‘ఆ తల్లికి 21 మంది పిల్లలంట’, ‘తప్పులకు వందనం’ శీర్షికలతో ‘సాక్షి’ కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన విద్యాశాఖ కమిషనరేట్ స్థానిక విద్యాశాఖ అధికారులు మొట్టికాయలు వేసింది. ఈ నేపథ్యంలో పుట్టపర్తి ఎంఈఓ–2 ప్రసాద్ ఆయా గ్రామాల్లో పర్యటించి విచారణ చేపట్టారు. ఈనెల 16వ తేదీన వచ్చిన ‘ఆ తల్లికి 21 మంది పిల్లలంట!’ కథనానికి సంబంధించి పుట్టపర్తి మండలం పెడపల్లి–1 సచివాలయంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఈనెల 18వ తేదీన ప్రచురించిన ‘తప్పులకు వందనం’ కథనానికి సంబంధించి పెడపల్లి–2 సచివాలయం పరిధిలోని గువ్వలగుట్టపల్లి, బత్తలపల్లి, కోనాపురం, సుబ్బరాయనిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విచారణ పట్టారు. అయితే సదరు ఆధార్ నంబర్లు గానీ, భావన, ఇంద్రజ పేర్లు కలిగిన తల్లులు గానీ ఆయా గ్రామాల్లోనే లేవని తేలింది. విద్యాశాఖ కమిషనరేట్‌లోనే తప్పు జరిగి ఉంటుందని ఎంఈఓ ప్రసాద్ ప్రాథమికంగా తేల్చారు. ఆయా తల్లుల పేర్లతో వచ్చిన 39 మంది విద్యార్థుల ఆధార్‌లు, తల్లి పేర్లు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామన్నారు. విద్యార్థులందరూ ‘తల్లికి వందనం’ పథకానికి అర్హులేనని... ఎక్కడ పొరపాటు జరిగిందో తెలియదన్నారు. జూలై 5వ తేదీన వచ్చే తుది జాబితాలో తప్పకుండా విద్యార్థుల పేర్లు చేర్చి న్యాయం చేస్తామని తెలిపారు.

ఇంటి దొంగ గుట్టురట్టు

- కాపర్ వైర్‌పై కన్నేసిన కన్నింగ్ లైన్‌మెన్
- దాదాపు 300 మీటర్ల కాపర్ వైర్ అపహరణ.. విక్రయం
- అక్రమాలపై విచారణ చేపడతామన్న విద్యుత్ శాఖ ఏడీ



కణేకల్లు: విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ కాపర్‌వైర్‌పై కన్నేశాడు. గుట్టుచప్పుడు కాకుండా కాపర్‌వైర్‌ను అపహరించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ అక్రమాలు కాస్త వెలుగు చూడడంతో విచారణకు ఆ శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల క్రితం కణేకల్లులోని వివిధ కాలనీలో కరెంటు సరఫరా కోసం విద్యుత్ స్తంభాలంపై కాపర్ వైర్‌తో లైన్‌లు ఏర్పాటు చేశారు. ఈ కాపర్ వైర్‌పై కన్నేసిన లైన్‌మెన్ ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వాటిని తొలగించి, సిల్వర్ వైర్ లాగాడు. కణేకల్లులోని వివిధ ప్రాంతాల్లో 9 స్తంభాలకు ఏర్పాటు చేసిన సుమారు 300 మీటర్లు అంటే సుమారు 120 కిలోల కాపర్ వైర్ మాయమైనట్లు సమాచారం. వీటి విలువ రూ.72 వేలు ఉంటుందని అంచనా.

ఎల్‌సీ ఎలా తీసుకొన్నాడు?

కాపర్ వైర్ లైన్ మార్పిడి పనులు తమకు తెలియకుండా జరిగాయని లైన్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఏఈ సైతం పేర్కొనడం గమనార్హం. లైన్ మార్పిడి చేయాలంటే తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ఆ తర్వాత మెటీరియల్ వస్తే అధికారుల ఆదేశాల మేరకు పనులు చేయాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులకు ఎంత మాత్రం తెలియకుండా ఓ లైన్‌మెన్ ఇంతటి సాహసానికి ఒడిగట్టడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాపర్ వైర్ లైన్ మార్పిడి సమయంలో ఎల్‌సీ ఎలా తీసుకొన్నాడు? పనులెప్పుడు చేశాడనేది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారింది.

ఎంఎస్ మీటర్ మార్పిడికీ డబ్బు వసూలు

ఎంఎస్ మీటర్ (మీటర్ స్ట్రక్ మీటర్) మార్పిడి అంశంలో మామూళ్ల వసూళ్లకు సదరు లైన్‌మెన్ తెరలేపినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక వేళ మీటర్లు కాలిపోతే వినియోగదారుడు డిపార్ట్‌మెంటుకు రూ.1,050 చెల్లించి కొత్త మీటర్ పొందాల్సి ఉంటుంది. అలా కాకుండా చెడిపోయినా, రీడింగ్ రన్నింగ్ కాకపోయినా వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ ఉచితంగా మీటర్లను సరఫరా చేస్తోంది. దీనికి ఎలాంటి చార్జీలు వసూలు చేయరు. ఎంఎస్ మీటర్లను ఉచితంగా మార్చాల్సి ఉండగా... సదరు లైన్‌మెన్ వినియోగదారుల నుంచి రూ.1,500 నుంచి రూ. 2వేల వరకూ వసూలు చేసినట్లు సమాచారం. కణేకల్లులో 50కి పైగా స్ట్రక్ మీటర్లున్నాయని కొత్త మీటర్లు తీసుకెళ్లిన సదరు లైన్‌మెన్... వినియోగదారులు డబ్బు ఇవ్వకపోవడంతో వాటిని రిప్లేస్ చేయకుండా తన వద్దే ఉంచుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలే నా దృష్టికి వచ్చింది

కణేకల్లులో కాపర్ వైర్ మాయమైనట్లు ఇటీవలే నా దృష్టికి వచ్చింది. ఈ పని ఎవరు చేశారనే దానిపై విచారణ చేపడతాం. లైన్ మార్పిడి చేస్తే పాత కేబుల్‌ను ఏఈకు అప్పగించాలి. అలా చేయకుండా అమ్మేయడం తప్పు. కాపర్ వైర్ మాయం చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఎంఎస్ మీటర్ల రిప్లేస్ అవినీతిపై కూడా విచారణ చేపడతాం. బాధితులెవరైనా ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలి.
– భాస్కర్, విద్యుత్ శాఖ ఏడీ, ఉరవకొండ

యువకుడి దుర్మరణం



రమేష్ (ఫైల్)

బత్తలపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామానికి చెందిన పొత్తూరి వెంకటస్వామి కుమారుడు రమేష్(39) అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో రమేష్‌ను పిలుచుకుని అతని అన్న వెంకటరమణ ద్విచక్ర వాహనంపై బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి బయలుదేరాడు. గ్రామ శివారున ఉన్న నాగేలి చంద్రశేఖర్ నాయుడు ఇంటి వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడంతో వెనుక కూర్చొన్న రమేష్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోరంట్ల: మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన యువ రైతు నరేష్ (30) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన... స్టార్టర్ పెట్టెకు అనుసంధానం చేసిన విద్యుత్ కనెక్షన్‌లో లూజ్ కాంటాక్ట్ ఉండడంతో మరమ్మతుకు పూనుకున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, నరేష్‌కు భార్య కోమలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డ్రిల్లింగ్ మిషన్‌కు వైర్లు తగిలి..



మృతుడు జిలాన్

కదిరి టౌన్: స్థానిక జెండా వీధిలో నివాసముంటున్న షేక్ జిలాన్ (39) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆయన... స్థానిక తాయీ జ్యువెలర్స్ వెనుక ఉన్న కాలువ కనిపించకుండా ఇనుప కడ్డీలను అమర్చి బండలు వేసే పనికి బుధవారం వెళ్లాడు. ఆ సమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య షేక్ పర్వానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువతి బలవన్మరణం

హిందూపురం: మండలంలోని చౌళూరు గ్రామానికి చెందిన రక్షిత (17) ఆత్మహత్య చేసుకుంది. ఇంటర్ చదివిన ఆమె ఇంట్లో అమ్మ, నాన్న తరుచూ గొడవ పడుతూ గట్టిగా కేకలు వేస్తుండడంతో మనస్తాపానికి గురై ఈ నెల 5న ఇంట్లోనే క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరులో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనతో బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నలుగురు జీవిత ఖైదీల విడుదల



విడుదలైన ఖైదీలతో జైలు సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి నలుగురు జీవిత ఖైదీలు విడుదలయ్యారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది జీవిత ఖైదీలను విడుదల చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఓపెన్ ఎయిర్ జైలుకు చెందిన నలుగురు ఖైదీలు ఉన్నారు. విడుదలైన వారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు గ్రామానికి చెందిన రామస్వామి, వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోల్‌రెడ్డి, అదే జిల్లా కడపలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫకృద్దీన్, నెల్లూరులోని జీనిగిల వీధికి చెందిన చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి విడుదల ఆర్డర్ కాపీతో పాటు నూతన వస్త్రాలను అందజేసి బుధవారం రాత్రి సాగనంపినట్లు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన సంగమేష్ కుమారుడు శివాజీ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ పూర్తి చేసినా.. తనకు ఉద్యోగం రాలేదన్న మనోవేదనతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

19 నుంచి సౌత్‌జోన్ సీనియర్ టీ-20 క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ ఆర్డీటీ స్టేడియం వేదికగా సౌత్ జోన్ సీనియర్ టీ–20 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. మొత్తం 5 జట్లు ప్రాతినిధ్యం వహించే ఈ టోర్నీని రౌండ్ రాబిన్ లీగల్ ఫార్మెట్‌లో నిర్వహిస్తున్నారు. టోర్నీలో ప్రాతినిధ్యం వహించే అనంతపురం జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో బి.వినయ్‌కుమార్, పి.గిరినాథరెడ్డి, పి.అర్జున్‌టెండూల్కర్, మచ్చా.కె.దత్తారెడ్డి, ఎం.రాజకుళ్లాయప్ప, టి.మహేందరరెడ్డి, జి.సంపత్‌కుమార్, బి.సంతోష్, రోహిత్ రోషణ్, జి.మల్లికార్జున, ఎస్‌ఎండీ కమిల్, ఎం.దీపక్, ఎస్.మహబూబ్‌పీరా, టి.ప్రదీప్‌రెడ్డి, కోగటం హనీష్ వీరారెడ్డి, చైత్ర వర్ధన్‌తో పాటు స్టాండ్ బైగా కె.ప్రమోద్, బి.ప్రశాంత్, భానుప్రకాష్, ఎంకే లోహిత్ సాయికిషోర్, పి.వికాస్ ఉన్నారు.

కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం: నగరంలోని రూడ్ సెట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 38 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. రేషన్, ఆధార్ కార్డులు కలిగి ఉండాలి. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

మహిళ అకౌంట్‌కు నగదు జమ

సాక్షి ఎఫెక్ట్..

సోమందేపల్లి: తల్లికి వందనం పథకం కింద సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన దళితురాలు నాగమణి బ్యాంక్ ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసిన నగదును తిరిగి ఆమె ఖాతాలోనే కెనరా బ్యాంక్ అధికారులు బదలాయించారు. భర్తకు డయాలసిస్ చేయించాల్సి ఉండడంతో పాటు తన ఇద్దరు కుమార్తెల పాఠశాలల ఫీజులు చెల్లించాల్సి ఉండడంతో ఐదు రోజుల క్రితం నగదు డ్రా చేసుకునేందుకు మాగేచెరువులోని కెనరాబ్యాంక్‌కు నాగమణి వెళ్లింది. అయితే నగదు విత్‌డ్రాకు మేనేజర్ సహకరించకుండా గతంలో తీసుకున్న డ్వాక్రా రుణానికి సంబంధించి ఆ నగదు చెల్లింపు చేసుకున్నట్లుగా తెలపడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె బ్యాంక్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేసింది. ఆమె కష్టాన్ని వెలుగులోకి తెస్తూ బుధవారం ‘సాక్షి’లో వెలువడిన కథనంపై బ్యాంక్ అధికారులు స్పందించారు. దీంతో ఆమె ఖాతా నుంచి డ్వాక్రా రుణానికి బదలాయించిన రూ.33 వేలను తిరిగి ఆమె ఖాతాలోనే జమ చేశారు.

జాతీయ రహదారిపై పందుల అపహరణ

కనగానపల్లి: మండలంలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై పందులను తరలిస్తున్న వాహనాన్ని దుండగులు అడ్డుకుని పందులను మరో వాహనంలో అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దరూర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన ఎరికల రామకృష్ణ, బసవరాజు, వెంకటేష్ ఓ బొలెరో వాహనంలో మంగళవారం రాత్రి 89 పందులను కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ సమీపంలోని పేరసంద్రకు తీసుకెళుతున్నారు. వెంబడిస్తూ వచ్చిన మరో వాహనంలోని 15 మంది దుండగులు దాదులూరు సమీపంలోకి చేరుకోగానే బొలెరో వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం పందుల యజమానులను బెదిరించి 89 పందులను అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ల హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియపై విద్యార్థుల అవగాహన కోసం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకూ రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుంది. నూతన విద్యా విధానాన్ని అనుసరించి ఈ విద్యా సంవత్సరంలో ఆర్ట్స్ కళాశాలలో 41 డబుల్ మేజర్ కోర్సులను ప్రవేశపెట్టారు.

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లా వాసుల ప్రతిభ



బహుమతులు అందుకున్న జిల్లావాసులు

అనంతపురం అర్బన్: ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడ వేదికగా నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లావాసులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో నగరానికి చెందిన బి.భావన రసజ్ఞ ప్రథమ బహుమతి సాధించారు. సోలో యోగా పోటీల్లో (35 ఏళ్లు ఆపై) నగరానికి చెందిన ఎం.చలపతి రెండో బహుమతి గెలుచుకున్నారు. షార్ట్ ఫిలిమ్ పోటీల్లో (35 ఏళ్లు ఆపై) గుత్తికి చెందిన సి.విజయభాస్కర్ చౌదరి ద్వితీయ బహుమతి సాధించారు. పోస్టర్ పోటీల్లో (35ఏళ్లు ఆపై) ఉరవకొండకు చెందిన కె.సునీత మూడో బహుమతి దక్కించుకున్నారు. యోగా షార్ట్ ఫిలిమ్ పోటీల్లో (10–18 ఏళ్ల మధ్య) ఉరవకొండకు చెందిన కె.భరణి రెండో బహుమతి, యోగా క్విజ్ పోటీల్లో (19–35 ఏళ్లు) నగరానికి చెందిన బి.భావన రసజ్ఞ, బి.సాయి చంద్రశేఖర్ (ఉరవకొండ), కె.రుషిత తన్మయి తృతీయ బహుమతి గెలుపొందారు.

కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం: నగరంలోని రూడ్ సెట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 38 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. రేషన్, ఆధార్ కార్డులు కలిగి ఉండాలి. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

నలుగురు జీవిత ఖైదీల విడుదల



విడుదలైన ఖైదీలతో జైలు సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి నలుగురు జీవిత ఖైదీలు విడుదలయ్యారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది జీవిత ఖైదీలను విడుదల చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఓపెన్ ఎయిర్ జైలుకు చెందిన నలుగురు ఖైదీలు ఉన్నారు. విడుదలైన వారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు గ్రామానికి చెందిన రామస్వామి, వైఎస్సార్ కడప జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోల్‌రెడ్డి, అదే జిల్లా కడపలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫకృద్దీన్, నెల్లూరులోని జీనిగిల వీధికి చెందిన చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి విడుదల ఆర్డర్ కాపీతో పాటు నూతన వస్త్రాలను అందజేసి బుధవారం రాత్రి సాగనంపినట్లు జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు.